క్లుప్తంగా

కథల పుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న శిక్షణ ఫౌండేషన్ సభ్యులు

పూడూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు అంజిలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పుస్తకాలతో పాటు ఫ్లాష్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కథల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ మెంటర్ రాకేష్, ఉపాధ్యాయులు మాణిక్యాచారి, పుష్పలత, లక్ష్మి, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్‌కు తాత్కాలిక ఎంపీడీఓ నియామకం



నూతన ఎంపీడీఓ, సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: చౌడాపూర్ నూతన మండలంలో మండల పరిషత్ తాత్కాలిక కార్యాలయాన్ని గురువారం ఏర్పాటు చేశారు. దోమ మండల ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న సోమలింగంను చౌడాపూర్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా కుల్కచర్ల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలోని ఒక భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి కేటాయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మోమిన్‌పేట: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ మల్లేశం గురువారం మండల వనరుల కేంద్రం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదన్నారు. కార్యక్రమంలో టేకులపల్లి ప్రధానోపాధ్యాయుడు పవార్ శంకర్, ఏటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సమ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి దేవ్యానాయక్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం బంట్వారం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, నాయకులు ప్రకాష్, తుకారాం, హీరామాన్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో గతంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో మండలంలో ఉన్న జనాభా ప్రతిపాదికన 12 ఎంపీటీసీ స్థానాలకు తగ్గుతున్నాయని, దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. గురువారం ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఆమె దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ 30న విడుదల చేశామని, వీటిపై 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2లలో పరిశీలన, 3వ తేదీ ఫైనల్ జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

కొత్తూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కొత్తగా ప్రతిపాదించిన ఎంపీటీసీల స్థానాలు, గ్రామాల పరిమితులపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీ ఏర్పడకముందు మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం 6 స్థానాలు ఉన్నట్లు వివరించారు. గూడూరు ఎంపీటీసీ పరిధిలో గూడూరు, మక్తగూడ, మల్లాపూర్‌తాండ గ్రామాలు, తీగాపూర్ ఎంపీటీసీ పరిధిలో తీగాపూర్, మల్లాపూర్, పెంజర్ల ఎంపీటీసీ పరిధిలో పెంజర్ల, కొడిచర్ల ఎంపీటీసీ పరిధిలో కొడిచర్ల, కొడిచర్ల తాండ, ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ పరిధిలో ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ ఎంపీటీసీ పరిధిలో సిద్ధాపూర్, వైఎంతాండ గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2న అభ్యంతరాల పరిష్కరణ, 3న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

మహాత్ముడి మార్గం అనుసరణీయం



యాలాల: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ గిరి తదితరులు



ధారూరు: నివాళి అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు

యాలాల: జాతిపిత మహాత్మా గాంధీ ఆదర్శనీయుడని యాలాల ఎస్‌ఐ గిరి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని పీఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీజీ పాత్ర మరువలేనిదన్నారు. అహింస, సత్యం, ధర్మం, నీతి నిజాయితీ లాంటి విషయాల్లో ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పీఎస్‌ఐ లలిత్ ప్రథం, ఏఎస్‌ఐ రవీందర్‌గౌడ్, కానిస్టేబుళ్లు మహేశ్వర్‌రెడ్డి, హన్మంతు, సందీప్, స్నేహిత, అనురాధ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో..

ధారూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐలు స్వప్న, నవీనలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మౌనం పాటించారు.

దుద్యాల్..

దుద్యాల్ : మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించుకునే జాతీయ అమర వీరుల దినోత్సవాన్ని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించారని అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు కొనసాగించాలి

మోమిన్‌పేట: గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఉందని జిల్లా కార్యదర్శుల సంఘం మాజీ అధ్యక్షుడు నర్సింలు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అహింస సిద్ధాంతాలతో దేశ ప్రజలను ఒక్క తాటిపై నిలిపి స్వాతంత్య్ర ఉద్యమాన్ని నడిపారన్నారు. ప్రపంచ దేశాలు సైతం మహాత్ముడి బాటలో నడిచి శాంతిని కోరుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శంకర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



దుద్యాల్: మౌనం పాటిస్తున్న అధికారులు, గ్రామస్తులు



మోమిన్‌పేట: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



యాలాల: సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

యాలాల ఎంఈఓ ఉద్యోగ విరమణ

యాలాల/బషీరాబాద్: మండల విద్యాధికారితో పాటు ఉపాధ్యాయుడిగా సుధాకర్‌రెడ్డి సేవలను మరువలేనివని ఉపాధ్యాయ సంఘ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం యాలాల బాలుర ఉన్నత పాఠశాలలో సుధాకర్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుధాకర్‌రెడ్డి గత 15 ఏళ్లుగా ఎంఈఓగా మండలానికి చేసిన సేవలు అమోఘమన్నారు. ఉపాధ్యాయులతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు, సౌకర్యాలు, ఉన్నత విద్యకు, మంచి ఫలితాల కోసం తీసుకున్న చర్యలు మరిచిపోలేనివన్నారు. అనంతరం పీఆర్‌టీయూ, టీపీయూఎస్, టీయూటీఎఫ్ సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, నాయకులు రాజేందర్‌రెడ్డి, అక్బర్‌బాబా, వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మొగులయ్య, క్రిష్టారెడ్డి, రాములు, ప్రభాకర్‌చారి, లక్ష్మీకాంతరావు, వీరేశం, నరహరిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్ ప్రసాద్, దీపక్ రాథోడ్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్

కొడంగల్: పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్న 60 మందికి పరీక్షలు చేయగా అందులో 16 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివ కుమార్ గుప్తా, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్ లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికార కాంక్షతోనే హామీలు



గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ

కుల్కచర్ల: కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా సాధ్యం కాని హామీలు ఇచ్చి 420 రోజులు అవుతున్నా ఇప్పటికీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ మండల నాయకులు రాజు, మాలె కృష్ణయ్య గౌడ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన 420 రోజులు అయినప్పటికీ హామీలు అమలు చేయాలని గాంధీ చిత్రపటానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికారకాంక్షతో ఇష్టారీతిన నోటికి వచ్చినవిధంగా హామీలు ఇచ్చారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని ఇప్పటివరకు మూడు పర్యాయాలు దరఖాస్తులు స్వీకరించారు తప్పిస్తే ఇప్పటివరకు ఏ ఒక్కరికీ కూడా ఇల్లు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండయ్య, శంకర్‌నాయక్, మొగులయ్య, మహేశ్వరం రాములు, పెద్ద నర్సింలు, వెంకట్రాములు, అంగూర్, రవిలాల్ తదితరులు పాల్గొన్నారు.

‘లక్ష్మిదేవిపల్లి’కి నిధులు కేటాయించండి

- మొగిలిగిద్దకు వస్తున్న సీఎం రిజర్వాయర్‌పై వైఖరి స్పష్టం చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కార్ లక్ష్మిదేవిపల్లి నిర్మాణానికి రూ.35వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారని, తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా నుంచి ఎంపీగా కేసీఆర్ గెలిచిన తర్వాత లక్ష్మిదేవిపల్లి డిజైన్, బడ్జెట్‌లో మార్పులు జరిగాయన్నారు. లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టును కట్టి తీరుతామని చెప్పిన గత ప్రభుత్వాలు ప్రాజెక్టుకు తట్టెడు మట్టిని కూడా తీయలేదని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను తొండి సంజయ్ అంటూ వ్యక్తిగతంగా దూషించడం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సరికాదని హితవు పలికారు. ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, అధికారాన్ని నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని దాస్యనాయక్ తండా గ్రామపంచాయతీలో బాబాసాహెబ్ విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి అజయ్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం(ఫిబ్రవరి 1న) నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేటీఆర్ రాక

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో మహేశ్‌రెడ్డి సేవాలాల్ సేన సంఘ నాయకులతో కలిసి దాస్యనాయక్ తండాలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి అజయ్ నాయక్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శంకర్ నాయక్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మేగ్యనాయక్, రాజు, ఆంజనేయులు, రాజు, అంగూర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు



ఉపాధి హామీ సామాజిక గ్రామసభలో పాల్గొన్న స్థానికులు

తాండూరు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన వివిధ ఉపాధి పనులపై తనిఖీలు చేపట్టారు. 11 మంది బ్లాక్ రిసోర్స్ పర్సన్(బీఆర్‌పీ)లు గ్రామాల్లో తిరిగి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సామాజిక తనిఖీలు ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఫిబ్రవరి 3న తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా వేదిక కార్యక్రమం ఉంటుందని ఎస్‌ఆర్‌పీ రంజీత్ తెలిపారు. మండలంలో 33 గ్రామాల్లో 752 పనులకు గాను సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేయగా కూలీల వేతనాలు రూ.3 కోట్లకు పైగా, రూ.17,25,238 సామగ్రి చెల్లింపులు జరిగినట్లు ఎస్‌ఆర్‌పీ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటన

యాలాల: మండలంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శుక్రవారం అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం పర్యటించనున్నారని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు అగ్గనూరు ఉన్నత పాఠశాలలో రూ.27లక్షలతో చేపట్టనున్న అదనపు గదుల పనులకు శంకుస్థాపన, అనంతరం యాలాల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ.27లక్షలతో అదనపు గదులకు భూమిపూజ చేయనున్నారు. చివరగా దేవనూరు ఉన్నత పాఠశాలలో స్మార్ట్ స్టేజీని ప్రారంభించనున్నట్లు వివరించారు.

పంచాయతీ రోడ్లకు మహర్దశ

మోమిన్‌పేట: మండల పరిధిలోని నాలుగు పంచాయతీ రోడ్లకు మహర్దశ పట్టనుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపి నాలుగు రోడ్లకు నిధులు మంజూరు చేయించారన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి పంచాయతీ రోడ్డుకు రూ.67లక్షలు, దేవరంపల్లికి రూ.30లక్షలు, చక్రంపల్లి రోడ్డుకు రూ.45 లక్షలు, బిక్కరెడ్డిగూడెం రోడ్డుకు రూ.3కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు.

3 నుంచి సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు

కుల్కచర్ల: మండలంలోని పుట్టపహాడ్ గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీ కోదండ సీతారామ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 5 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త రమేశాచార్యులు తెలిపారు. జిల్లా పరిధిలోని భక్తులందరూ మూడురోజులు జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న టీచర్లు, వైద్య సిబ్బంది

ధారూరు: కుష్టు వ్యాధిపై అవగాహన అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాంతి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీల్లో గురువారం కుష్టువ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని, వ్యాధి సోకిన వారిని సమీప ఆసుపత్రులకు తీసుకువచ్చి చికిత్స అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సురేందర్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి రహిత సమాజానికి కృషి



కుల్కచర్ల: అవగాహన కల్పిస్తున్న మెడికల్ అసిస్టెంట్ వెంకట్

కుల్కచర్ల: కుష్టు వ్యాధి రహిత భారతదేశ నిర్మాణంలో మనందరం భాగం కావాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, కుల్కచర్ల మెడికల్ అసిస్టెంట్ వెంకట్‌లు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి సోకిన వారిని దూరం చేయకుండా ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందిస్తే వ్యాధి నయం అవుతుందన్నారు. విద్యార్థులు తమ సహచరులు, ఇంటి పక్కవారికి కుష్టు వ్యాధి సోకిన యెడల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ముందుగానే స్వీయ పరీక్ష చేయించు కోవాలని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ అమరేశ్వరీ అన్నారు. గురువారం మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చట్టం ముందు అందరూ సమానులే

తహసీల్దార్ తారాసింగ్



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



యాలాల: బాగాయిపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

తాండూరు రూరల్: భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా గ్రామాల్లో అందరూ సమానమేనని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ చెప్పారు. పౌరహక్కుల మండల అధికారి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పౌరహ క్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులను భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నదమ్ముళ్ల అందరూ కలిసిమెలసి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం అందరూ సమానమేనని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ జాబీస్, ఏఎస్‌ఐ పవన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ బాబు, పంచాయతీ కార్యదర్శి సమీర్, గ్రామస్తులు ఉన్నారు.

అందరూ కలిసిమెలసి ఉండాలి

యాలాల: సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలసి ఉండాలని యాలాల తహసీల్దార్ అంజయ్య అన్నారు. గురువారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా బాగాయిపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో బేధాభిప్రాయాలకు అవకాశం లేకుండా, కలిసిమెలసి ఉండాలన్నారు. పౌరహక్కులతో పాటు విధుల గురించి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

మర్పల్లి: సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించాలని సిరిపురం బాలుర ఎస్సీ వసతి గృహం వార్డెన్ తుల్జారాంగౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామ పంచాయతీ వద్ద పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరు కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జీవించాలని గ్రామస్తులకు సూచించారు. చాయ్ హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతిని తీసివేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమానత్వంతో మెలగాలి

కొడంగల్ రూరల్ : ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలగాలని, అంటరానితనం నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని అంగడిరాయిచూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉండే సామాజిక రుగ్మతలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులతోపాటు గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. రెండు గ్లాసుల విధానం, అంటరానితనం తదితర విషయాలపై ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హన్మంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీహరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.